
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 5 । నవంబర్ । 2023





**సోమశిలలో 30.007 టీఎంసీలు**

సోమశిల: సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 30.007 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 621 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



**బంగారం ధరలు**

24 క్యారెట్లు (10 గ్రాములు) -రూ.63,050
22 క్యారెట్లు ఆర్నమెంటు (గ్రా)- రూ.5,662
3 శాతం జీఎస్టీతో.. - రూ.5,832
నవర (8 గ్రా) - రూ.46,656

గరిష్టం/కనిష్టం
31.5 /25.6

**వాతావరణం**

శనివారం గాలిలో తేమ 82 శాతం ఉంది. ఆదివారం జిల్లావ్యాప్తంగా పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

## న్యూస్‌రీల్

### 97.8 శాతం పింఛన్ల పంపిణీ



ఆస్పత్రిలో ఉన్న యల్లమ్మకు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ ఈశ్వరయ్య

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక నగదు పంపిణీ ప్రక్రియ జిల్లాలో కొనసాగుతోంది. నాలుగో రోజు శనివారానికి 97.8 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ కానుక నగదును వలంటీర్లు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 3,16,617 మంది లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 3,09,663 మందికి పంపిణీ చేశారు. పింఛన్ కానుక పంపిణీలో రాపూరు, నెల్లూరు, ఇందుకూరుపేట మండలాలు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

### సబ్సిడీపై ఉల్లి విక్రయాలు ప్రారంభం



ఫత్తేఖాన్‌పేట రైతుబజార్‌లో ఉల్లి విక్రయాలు ప్రారంభిస్తున్న ఏడీ అనితాకుమారి

నెల్లూరు(సెంట్రల్): ఉల్లి ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రజలపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం శనివారం నుంచి సబ్సిడీపై ఉల్లి విక్రయాలను ప్రారంభించింది. నెల్లూరులోని ఫత్తేఖాన్‌పేట, నవాబుపేట రైతుబజార్లలో సబ్సిడీపై కిలో రూ.40 చొప్పున ఉల్లి విక్రయాలను మార్కెటింగ్ శాఖ ఏడీ అనితాకుమారి ప్రారంభించారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం నుంచి ఉల్లి విక్రయాలు కొనసాగుతాయని ఆమె తెలిపారు. ఉల్లి ధరలు తగ్గే వరకు ఈ విక్రయాలు కొనసాగిస్తామని తెలిపారు.

### జిల్లాలో 8.4 మి.మీ. వర్షపాతం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో శనివారం సగటున 8.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గరిష్టంగా తోటపల్లిగూడూరు మండలంలో 49.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ముత్తుకూరు మండలంలో 29.4, ఇందుకూరుపేట 22.8, ఉలవపాడు 22.4, గుడ్లూరు 18.6, వావిలేటివారిపాళెం 15.8, వెంకటాచలం 14.6, సీతారామపురం 14.2, ఉదయగిరి 14, దగదర్తి 12.4, ఆత్మకూరు 10.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

### జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయండి

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జలజీవన్ మిషన్ పనులను వేగవంతం చేసి నిర్దేశిత సమయంలోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సంబంధిత ఇంజినీర్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జలజీవన్ మిషన్ పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనులకు వారాంతపు లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకనుగుణంగా పనులు చేపట్టాలన్నారు. ఇందుకుగాను ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని మెటీరియల్ సమీకరణ, ఇతర అవసరాలను గుర్తించి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని తెలిపారు. ఆయా పనులకు సంబంధించి నిధులకు ఎలాంటి కొరత లేనందున పనులు వేగవంతం చేయాలన్నారు. డీఈలు వ్యక్తిగత బాధ్యత తీసుకుని అనుకున్న సమయం లోపు పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రంగప్రసాద్‌రావు, ఇతర డీఈలు పాల్గొన్నారు.

# మెట్టలో సాగు సిరులు

రైతుల అభ్యున్నతే ధ్యేయంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. సర్వేపల్లి నియోజకవర్గంలోని దేగపూడి–బండేపల్లి లింక్ కెనాల్ పనులు గత టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వాకంతో ఏడెనిమిదేళ్లుగా వాయిదాలు పడుతూ వచ్చాయి. కాగా ప్రస్తుత ప్రభుత్వం మెట్ట గ్రామాల్లో సాగు సాకారం దిశగా చర్యలు చేపట్టడంతో ఈ లింక్ కెనాల్ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

**చురుగ్గా దేగపూడి–బండేపల్లి లింక్ కెనాల్ పనులు**

- రూ.30 కోట్లతో 9.2 కిలోమీటర్ల కాలువ నిర్మాణం
- భూములు కోల్పోయిన రైతులకు రూ.10 కోట్ల పరిహారం
- సాకారమవుతున్న కర్షకుల కల



పొదలకూరు మండలంలో ముమ్మరంగా జరుగుతున్న లింక్ కెనాల్ పనులు



కెనాల్ పనులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

మనుబోలు: అందరికీ అన్నం పెట్టే రైతన్నల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసింది. అందులో భాగంగా సర్వేపల్లి నియోజకవర్గం మనుబోలు మండలంలో బండేపల్లి లింక్ కెనాల్ పనులను వేగవంతం చేసింది. ఈ ఏడాది ఆఖరుకు కెనాల్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటోంది. మనుబోలు మండలంలోని గొట్లపాళెం, వడ్లపూడి, రాజోలుపాడు, వీరంపల్లి, లింగారెడ్డిపల్లి, అక్కంపేట, కొండుపాళెం, మడమనూరు, పర్లపాడు, కుడితిపల్లి, బండెపల్లి, జట్లకొండూరు, కొమ్మలపూడి, కాగితాలపూరు తదితర గ్రామాల పరిధిలోని 15 చెరువులకు బండేపల్లి బ్రాంచ్ కెనాల్, పొట్టేళ్ల కాలువల ద్వారా సాగునీరు సరఫరా అవుతోంది. బ్రాంచ్ కెనాల్‌కు సంగం బ్యారేజీ నుంచి కనుపూరు కాలువ ద్వారా సాగు నీరు అందుతుంది. కనుపూరు కాలువ ద్వారా వచ్చే నీరు అన్ని గ్రామాలకు సరిపోకపోవడంతో మెట్ట గ్రామాల్లో పంటలు ఓ ఏడాది పండితే మరో ఏడాది ఎండబెట్టుకునే పరిస్థితి ఉంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండలంలోని దేగపూడి నుంచి కండలేరు నీటిని మనుబోలు మండలంలోని బండేపల్లి బ్రాంచ్ కెనాల్‌లో కలిపేలా లింక్ కెనాల్‌ను తవ్వాలని నిర్ణయించారు. అయితే గత టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వాకాలతో లింక్ కెనాల్ పనులు ఎప్పటికప్పుడు వాయిదాలు పడుతూ వచ్చాయి. 2019 ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో భాగంగా పొదలకూరు మార్గంలో పాదయాత్ర చేసినప్పుడు స్థానిక ఎమ్మెల్యే, ప్రస్తుత రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి లింక్ కెనాల్ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే లింక్ కెనాల్‌ను పూర్తి చేసి మెట్ట గ్రామాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

**వడివడిగా కాలువ పనులు**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి లింక్ కెనాల్ పనులకు సంబంధించి సాంకేతిక పరమైన అడ్డంకులను ఒక్కొక్కటిగా పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. కాలువ నిర్మాణంలో పట్టా భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటికే పరిహారం అందజేశారు. డీకేటీ, అసైన్‌మెంట్ భూములకు సంబంధించిన పరిహారం మాత్రమే పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం లింక్ కెనాల్‌కు సంబంధించిన పనులు మనుబోలు, సైదాపురం మండలాల్లో దాదాపుగా పూర్తి కాగా, పొదలకూరు మండలంలో మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ ఏడాది చివరకు లింక్ కెనాల్ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కెనాల్ పూర్తయితే మనుబోలు మండలం బండేపల్లి బ్రాంచ్ కెనాల్, పొట్టేళ్ల కాలువ పరిధిలోని సుమారు 15 వేల ఎకరాల మెట్ట భూములకు సమృద్ధిగా సాగు నీరు అందుతుంది. తద్వారా ఆయా గ్రామాల రైతులు ఆర్థికాభివృద్ధి సాధించే అవకాశం కలుగుతుంది.

**ఓట్ల కోసమే టీడీపీ డ్రామాలు**

దేగపూడి–బండేపల్లి లింక్ కెనాల్ పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలన్న చిత్తశుద్ధి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి లేదు. కేవలం ఓట్ల కోసమే గత ఎన్నికలకు ముందు హడావుడిగా టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొచ్చి పనులు ప్రారంభించారు. కేవలం పరిపాలనాపరమైన అనుమతులివ్వడం తప్ప గత టీడీపీ ప్రభుత్వంలో ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదు. కొత్తగా ఒక కాలువ తవ్వాలంటే భూసేకరణకు సంబంధించి ఎన్నో రకాల ఇబ్బందులు ఎదురవుతాయి. వాటిన్నింటినీ పట్టించుకోకుండా ఎలాంటి వివాదాలు లేని ప్రభుత్వ భూమిలో మాత్రమే పనులు మొదలుపెట్టి కాలువ నిర్మిస్తున్నామంటూ సోమిరెడ్డి ప్రగల్భాలు పలికారు. గతంలో టీడీపీ ప్రభుత్వం, మాజీ మంత్రి సోమిరెడ్డి నిర్లక్ష్యం కారణంగానే కాలువ పనులు ఆలస్యమయ్యాయి. కానీ ప్రస్తుత ప్రభుత్వం మెట్ట గ్రామాల రైతుల అభ్యున్నతే ధ్యేయంగా కెనాల్ పనులు పూర్తి చేసి త్వరలోనే రైతులకు సాగు నీరు అందించేలా చర్యలు చేపడుతోంది.

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే..**



లింక్ కెనాల్ కోసం చేసిన భూసేకరణలో మాది ఒకటిన్నర ఎకరా పోయింది. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే భూసేకరణ చేసినా పరిహారం మాత్రం ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.12.50 లక్షల పరిహారం అందించారు. మనుబోలు మండలంలో పట్టా భూములు కోల్పోయిన రైతులందరికీ పరిహారం అందింది.

– బత్తల వెంకటేశ్వర్లురెడ్డి, రైతు, గొట్లపాళెం, మనుబోలు మండలం

**త్వరలో పనులు పూర్తి చేస్తాం**



లింక్ కెనాల్ పనులు ప్రస్తుతం ముమ్మరంగా జరుగుతున్నాయి. దేగపూడిలోని కండలేరు నుంచి నీటిని లింక్ కెనాల్ ద్వారా మనుబోలు మండలంలోని బండేపల్లి బ్రాంచ్ కెనాల్, పొట్టేళ్ల కాలువకు లింక్ చేస్తాం. త్వరలో పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– అనిల్‌కుమార్‌రెడ్డి, ఈఈ, జలవనరులశాఖ

## ఏపీఎస్‌ఆర్టీసీ ప్రయాణికులకు ప్యాకేజీ టూర్

• శబరిమల, అరుణాచలానికి ప్రత్యేక బస్సులు



నెల్లూరు సిటీ: అయ్యప్పస్వాముల యాత్ర, దర్శనాలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక బస్సులు, ప్యాకేజీలను ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చింది. నెల్లూరు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు నెల్లూరు ఆర్టీసీ డిపో అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

**శబరిమలకు టూర్ ప్యాకేజీ**

అయ్యప్పమాల ధరించిన భక్తులు శబరిమలలోని అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీలతో బస్సులను అందుబాటులోకి తెచ్చింది. తక్కువ చార్జీలతో భక్తులకు అనుకూలంగా అద్దె బస్సులు, బస్సు టికెట్లు అందిస్తోంది. నవంబర్ 16, 18, 22, 23, 25, 27, 29, 30 తేదీల్లో.. డిసెంబర్ 2, 4, 7, 8, 10, 14, 15, 17, 22, 23, 28, 29 తేదీల్లో.. జనవరి 3, 6 తేదీల్లో నెల్లూరు ఆర్టీసీ మెయిన్ బస్టాండ్ నుంచి ఉదయం 10 గంటలకు బస్సు బయలుదేరుతుంది. బస్సు ప్రయాణంలో శబరిమల వెళ్లేటప్పుడు కాణిపాకం, భవాని, ఎరిమేలి, పంబ ప్రాంతాలకు వెళ్లి, తిరిగి వచ్చేటప్పుడు కుర్తాళం, మధురై, చెన్నై, మేళమరువత్తూర్ ప్రాంతాలను సందర్శించే అవకాశాన్ని కల్పించారు. ఐదు రోజులపాటు ప్యాకేజీ టూర్ కింద నెల్లూరు నుంచి ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ టికెట్ రూ.4 వేలు, అల్ట్రా డీలక్స్ టికెట్ రూ.3,900, ఎక్స్‌ప్రెస్ టికెట్ రూ.3,300గా కేటాయించారు.

**26న అరుణాచలానికి..**

ఈ నెల 26వ తేదీన కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు అరుణాచలానికి నెల్లూరు ప్రధాన బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. 26వ తేదీ ఉదయం 10 గంటలకు బస్సు బయలుదేరుతుంది. రానుపోను టికెట్ ధర రూ.1,200గా నిర్ణయించారు.

## సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై దృష్టి సారించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరినారాయణన్, అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. శనివారం ఆయన సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుంచి వర్చువల్‌గా సమావేశమయ్యారు. జిల్లాలో మహిళల ఆరోగ్యం, పిల్లల సంక్షేమం, విద్య, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సరఫరా, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో 100 శాతం అమలు, వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర, పాఠశాలల్లో నాడు–నేడు పనుల పురోగతి, జగనన్నకు చెబుదాం తదితర అంశాలు, చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా 10–19 వయస్సు గల పిల్లలకు, 15–49 వయస్సు గల గర్భిణులకు ప్రతి నెలా వైద్యపరీక్షలు నిర్వహించాలని, రక్తహీనత గల వారికి ఐరన్ మాత్రలు, అదనపు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యాశాఖకు సంబంధించి గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో 100 శాతం సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీలను అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం లక్ష్యాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందించేలా అవగాహన కల్పించేందుకు రూపొందించిన ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరూ ఇన్‌స్టాల్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి, అభివృద్ధికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు అవగాహన కల్పించేలా ఈ నెల 15వ తేదీన దేశవ్యాప్తంగా 110 జిల్లాల్లో వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సీఎస్ తెలిపారు. రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం జిల్లా ఎంపికయ్యాయన్నారు.

**బాల్య వివాహాలను అరికట్టేలా అవగాహన**

ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి కలెక్టర్ హరినారాయణన్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో గ్రామ, వార్డుస్థాయి బాల్య వివాహాల నిరోధక కమిటీలను ఏర్పాటు చేసి బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీఎస్‌కు తెలిపారు. అలాగే 12 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలికల వివరాలను సచివాలయం వారీగా రూపొందించి వారి పరిస్థితిని మహిళా సంరక్షక కార్యదర్శి ద్వారా మానిటరింగ్ జరిగేలా యాప్‌ను రూపొందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, డీఈఓ గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ తదితరులు పాల్గొన్నారు.

## అంకమ్మతల్లిని దర్శించుకున్న ట్రిబ్యునల్ చైర్మన్



ఆలయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న దేవదాయశాఖ ట్రిబ్యునల్ చైర్మన్ హరినాథ్, పక్కన ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

కందుకూరు: దేవదాయశాఖ ట్రిబ్యునల్ చైర్మన్, జడ్జి హరినాథ్ శనివారం కందుకూరు గ్రామదేవత అంకమ్మతల్లిని కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నూతనంగా నిర్మించిన ఆలయం అద్భుతంగా ఉందని, పురాతన కాలం నాటి ఆలయ నిర్మాణంలో ఉపయోగించిన శిల్ప సౌందర్యాన్ని అంకమ్మతల్లి ఆలయ నిర్మాణంలో పొందుపరచడం ఆలయానికి శోభను తీసుకొచ్చిందన్నారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఆలయ నిర్మాణ విశేషాలను హరినాథ్‌కు వివరించారు. అంకమ్మతల్లి ఆలయాన్ని దాదాపు రూ.4.50 కోట్ల ఖర్చుతో నిర్మించామన్నారు. పురాతన శిల్ప కళను, అలాగే అష్టాదశ శక్తి పీఠాలను ఆలయ నిర్మాణంలో భాగంగా చేశామని తెలిపారు. రెండో దశలో దాదాపు రూ.4 కోట్లతో అలవేటి మండప నిర్మాణాన్ని ప్రారంభించామని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆలయం చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్లు పిలిచి నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. అంతకుముందు ఆయన పట్టణంలోని జనార్దనస్వామి దేవస్థానంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జనార్దనస్వామి దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రావుల కొల్లు బ్రహ్మానందం, అంకమ్మతల్లి ఆలయ కమిటీ సభ్యులు సూరం వేణుగోపాల్‌రెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, ఎనిమిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొడాలి కోటేశ్వరరావు, ఆవుల మాధవరావు, గాండ్ల శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మన్ తోకల కొండయ్య, హరిణి వైద్యశాల డాక్టర్ తన్నీరు మల్లికార్జున, ఆలయ శిల్పి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి కల్పనకు చర్యలు

• మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



గౌతమ్‌రెడ్డి మెమోరియల్ పార్క్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి

ఉదయగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి అన్ని ప్రాంతాలకు సాగునీటిని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ఉదయగిరిలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి అగ్రికల్చర్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న మేకపాటి గౌతమ్‌రెడ్డి మెమోరియల్ పార్క్ నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరిలోని అగ్రికల్చర్ కళాశాలను అగ్రికల్చర్ యూనివర్సిటీగా మార్చే అవకాశాలు ఉన్నాయన్నారు. గౌతమ్‌రెడ్డి ద్వితీయ వర్ధంతి సమయానికి మెమోరియల్ పార్క్‌ను ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభిస్తామన్నారు. వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే తాగు, సాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణం రెండు మాసాల్లో పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024లో మరలా ముఖ్యమంత్రి అవుతారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డి, నాయకులు వీరారెడ్డి, వెంగళరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కౌశల్ పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు (టౌన్): కౌశల్ – 2023కు సంబంధించిన పోస్టర్లను నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ గంగాభవాని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో కౌశల్‌కు నోటిఫికేషన్‌ను విడుదల చేశారని చెప్పారు. సైన్స్ క్విజ్ పోటీలకు గానూ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులతో టీమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. గణిత, సైన్స్, విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి అనే మెటీరియల్‌ను నిర్ణయించారన్నారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసపత్రం, జ్ఞాపికలను అందజేయనున్నారని వెల్లడించారు. పాఠశాల కోఆర్డినేటర్లు తమ స్కూల్ పేరును ఈ నెల 15లోపు రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 95020 67875, 79818 74656 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# అట్టహాసంగా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలను పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ప్రారంభించారు. అండర్ – 14, 17, 19 విభాగాలకు సంబంధించిన పోటీలకు ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన బాలికలు హాజరయ్యారు. విద్యార్థినులు మార్చ్‌పాస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. జిల్లాలో నిర్వహించిన పలు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఆత్మకూరు వేదికగా నిలవడం గర్వంగా ఉందన్నారు. కబడ్డీ పోటీలను ఆత్మకూరులో త్వరలో నిర్వహించేలా చూడాలని సూచించారు. తొలుత వివిధ జిల్లాల క్రీడాకారులు, పీఈటీ, పీడీలను పరిచయం చేసుకున్నారు.

**రూ.లక్ష చొప్పున నగదు ప్రోత్సాహం**

మూడు కేటగిరీల్లో నిర్వహిస్తున్న పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహక బహుమతిని అందజేయనున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. డిప్యూటీ డీఈఓ మధుబాబు, ప్రధానోపాధ్యాయురాలు అనంతలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు వెంకటరమణమ్మ, డాక్టర్ శ్రావణ్‌కుమార్, సర్దార్, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సానా వేణుగోపాల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణాలు వేగవంతం


మాట్లాడుతున్న హరినారాయణన్


హాజరైన పంచాయతీరాజ్ శాఖ అధికారులు

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను నిర్దేశిత వ్యవధిలోపు పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. ప్రభుత్వ భవన నిర్మాణ పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని కలెక్టరేట్లోని తన చాంబర్‌లో కలెక్టర్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవన నిర్మాణాల లక్ష్యాన్ని సాధించేందుకు పక్కా ప్రణాళికతో పనిచేయాలని కోరారు. నిర్మాణాలు పూర్తయిన భవనాలకు సంబంధించిన హ్యాండ్ ఓవర్ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణాలను జాప్యం లేకుండా పూర్తి స్థాయిలో చేపట్టాలని చెప్పారు. పంచాయతీరాజ్ ఈఈ బాలసుబ్బారావు, కావలి ఈఈ రవికుమార్, ఇంజినీరింగ్ అధికారులు చంద్రశేఖర్, శ్రీనివాసులు, మోహన్‌రావు, గౌతమ్, సురేష్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం


సమీక్షిస్తున్న సుబ్బరాజు

ఆత్మకూరు: ఎస్పీడీసీఎల్ ద్వారా నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే తమ లక్ష్యమని సంస్థ డైరెక్టర్ సుబ్బరాజు పేర్కొన్నారు. పట్టణంలోని విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయంలో డివిజన్ అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్డీఎస్సెస్ ద్వారా జిల్లాకు రూ.720 కోట్లు మంజూరయ్యాయని, దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో త్రీ ఫేజ్ విద్యుత్‌ను అందించనున్నామని వివరించారు. మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను 24 గంటల్లో మార్చాలని ఆదేశించారు. విద్యుత్ బకాయిలను నూరు శాతం వసూలు చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ యథావిధిగా కొనసాగనుందని, మీటర్ల ఏర్పాటుతో ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని చెప్పారు. జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనులను వేగంగా చేస్తున్నామని తెలిపారు. అనంతరం నెల్లూరుపాళెం సమీపంలోని 132, 33 కేవీ సబ్ స్టేషన్లను పరిశీలించారు. డీఈఈ జనార్దన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సురేష్, కోటేశ్వరరావు, ఏఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ప్రాణాలు కాపాడి..

ఇందుకూరుపేట: ఆత్మహత్యయత్నానికి పాల్పడిన మహిళను దిశ పోలీసులు కాపాడిన ఘటన ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. ఇందుకూరుపేటలో నివాసం ఉంటున్న మహిళకు తన భర్త ఏడుకొండలుతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమెపై ఏడుకొండలు గొడవపడి దాడికి శుక్రవారం సాయంత్రం పాల్పడ్డారు. మనస్తాపానికి గురైన బాధిత మహిళ పాయిజన్ సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లారు.

అటుగా వెళ్తున్న ఈశ్వరి గమనించి దిశ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలిసిన వెంటనే దిశ పోలీసులు అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దిశ పోలీసులు సైతం ఆమెతో వెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏడుకొండలుపై కేసు నమోదు చేశారు.

| నిమ్మ ధరలు | |
|---|---|
| పొదలకూరు (కిలో) | |
| పెద్దవి | : రూ. 50 |
| సన్నవి | : రూ. 20 |
| పండ్లు | : రూ. 6 |

| నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు | |
|---|---|
| బ్రాయిలర్: | రూ.112 |
| లేయర్ : | రూ.123 |
| బ్రాయిలర్ చికెన్: | రూ.200 |
| స్కిన్‌లెస్ చికెన్: | రూ.220 |
| లేయర్ చికెన్: | రూ.192 |

## లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న కపర్థి

నెల్లూరు సిటీ: హాస్పిటళ్లు, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డిస్ట్రిక్ట్ లెవల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సభ్యుడు, మొదటి అదనపు జిల్లా జడ్జి కపర్థి పేర్కొన్నారు. నగరంలోని సిద్ధార్థ నర్సింగ్ హోమ్, ఊంబ్ 9, వేద హాస్పిటళ్లలో ఆకస్మిక తనిఖీలను శనివారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. నిబంధనలను తప్పక పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తొలుత రికార్డులను పరిశీలించారు. డాక్టర్ గీతాలక్ష్మి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు శ్రీనివాసరావు, కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

## వీఎస్‌యూలో పరీక్షలకు నోటిఫికేషన్ విడుదల

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫస్ట్ సెమిస్టర్ (సప్లిమెంటరీ), మూడో సెమిస్టర్ (సప్లిమెంటరీ అండ్ రెగ్యులర్), ఐదో సెమిస్టర్ (సప్లిమెంటరీ) పరీక్షల నిర్వహణకు నోటిఫికేషన్‌ను విడుదల చేశామని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుము లేకుండా ఈ నెల ఐదు నుంచి 23 వరకు.. అపరాధ రుసుముతో 24 నుంచి 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వీఎస్‌యూ నిబంధనల మేరకు 2017 – 18లో డిగ్రీ చేరిన వారు 2022 – 23 సంవత్సరం నాటికి పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. అయితే అప్పుడూ ఉత్తీర్ణులు కాలేని వారి కోసం చివరి అవకాశాన్ని కల్పిస్తున్నామని వెల్లడించారు. ఈ విద్యార్థులు డిసెంబర్‌లో నిర్వహించనున్న పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రెండో, నాలుగో, ఆరో సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు రానున్న రోజుల్లో అవకాశాన్ని కల్పించనున్నారని పేర్కొన్నారు.

## రాపూరు సబ్ రిజిస్ట్రార్‌గా విజయరాణి

నెల్లూరు సిటీ: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ రాపూరు సబ్ రిజిస్ట్రార్‌గా విజయరాణిని నియమిస్తూ గుంటూరు డీఐజీ ఉత్తర్వులను శనివారం జారీ చేశారు. కొంతకాలంగా ఈ స్థానం ఖాళీగా ఉంది. ఈ క్రమంలో ఇన్‌చార్జిగా అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ జగన్‌మోహన్‌రావు విధులు నిర్వర్తిస్తున్నారు. తాజాగా విజయరాణికి పూర్తి బాధ్యతలు అప్పగించారు.

## కొనసాగుతున్న ఏసీబీ తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు చేపట్టిన తనిఖీలు శనివారం రెండో రోజూ కొనసాగాయి. రికార్డులను ఏసీబీ డీఎస్పీ మోహన్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఏటా ఫుడ్ కంట్రోలర్ జారీ చేసే లైసెన్స్‌లు, రెన్యువల్స్, తనిఖీలకు సంబంధించిన ప్రతి అంశాన్ని లోతుగా ఆరాతీస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్ని శాంపిళ్లు సేకరించారు.. వీటిలో ఎన్నింటిని ప్రయోగశాలకు పంపారు.. కల్తీలకు పాల్పడేవారిపై ఎలాంటి చర్యలు చేపట్టారు.. ఎంత జరిమానాలను విధించారనే అంశాలను పరిశీలిస్తున్నారు. సాధారణ తనిఖీ లేనని అధికారులు చెప్తున్నా, రెండో రోజూ కొనసాగడంతో కీలక సమాచారం లభ్యమైందని తెలుస్తోంది. మరో రెండు రోజుల పాటు తనిఖీలు కొనసాగే అవకాశముందని సమాచారం. ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, విజయకుమార్, కిరణ్, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పత్రికా ప్రకటన**

ఏ.సి.యస్.ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల, నెల్లూరు నందు నెలసరి వాహన (ఇన్నోవా కారు) బాడుగ రూ.45,000/- కొరకు దరఖాస్తుకు ఆహ్వానించడమైనది. తేది: 07.11.2023 సా.05.00 గం॥ల లోపు ఈ క్రింది వివరములతో సీల్డ్ కవరు నందు శ్రీయుత ప్రిన్సిపాల్, ఏ.సి.యస్.ఆర్ ప్రభుత్వ వైద్యకళాశాల, నెల్లూరు నందు దరఖాస్తు చేసుకొనవలసినదిగా తెలియజేయడమైనది.

వివరములు:-

1. పసుపు నెంబరు కలిగిన వాహనము (ట్రాన్స్‌పోర్టు)
2. వాహనము యొక్క వయస్సు 2 సంవత్సరముల లోపు ఉండవలెను (ఆర్సీ పుస్తకము)
3. కాలుష్య నియంత్రణ పత్రము
4. వాహనము నడుపు లైసెన్స్
5. వాహనము యొక్క ఆర్సీ పుస్తకము
6. వాహనము యొక్క బీమా మరియు సంబంధిత పత్రములు (Fitness Certificate)
7. వాహనము యొక్క పన్నులు ఈ రోజు వరకు కట్టినవి
8. వాహనము యొక్క నిర్వహణ మరియు సంబంధిత మరమత్తులు వాహనము యొక్క యజమాని చూసుకొనవలెను.
9. పై కాంట్రాక్టు కేవలము 1 సం॥ మాత్రమే వర్తించును. మీ యొక్క సేవలు పొడిగించుట కేవలము పై అధికారులకు మాత్రమే అధికారం కలదు.
10. డ్రైవర్ యొక్క జీతము వాహన యజమానియే భరించవలెను.
11. వాహనము యొక్క మైలేజీ నెలకు 2500 కి.మీ. తిరగవలెను, 2500 కి.మీ కంటే పైన జరిగిన ఎడల మేము ప్రతి కి.మీకు రూ.12/- చొప్పున చెల్లించగలవారము.
12. వాహనము మంచి కండీషన్ మరియు వాహనము పై ఎండ్ కలిగి ఉండవలెను.
13. వాహనమునకు నెలకు బాడుగ రూ.45,000/- మరియు వాహనము యొక్క విలువ రూ.10 లక్షల నుండి రూ.15 లక్షల లోపు ఉండవలెను.

అడిషినల్ డి.యం.ఇ మరియు ప్రిన్సిపాల్
ఏ.సి.యస్.ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల, నెల్లూరు